

'సింహ గర్జన' సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు :ఈనెల 29న గుంటూరులో ఎపి నూర్ భాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న నూర్ భాషా/ దూదేకుల ముస్లిం సింహ గర్జన కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సుభాన్ భాష పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అల్తాఫ్ ,సాయిబాబు , షేక్ షరీఫ్ ,హజ్రత్ అలీ, జహీర్ భాష, నిర్మల్ ,నవాజ్ ,అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇసుక మాఫియా దందా..!

జిల్లాలో ఇసుక మాఫియా దందా కొనసాగుతుంది. ఒకప్పుడు ఇసుక ఉచితంగా వినియోగదారులకు ప్రభుత్వం అందించేది. ఇప్పుడు నూతన ఇసుక విధానం గృహ వినియోగదారులకు చుక్కలు చూపిస్తుండగా, అధికారులు, అధికారపార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఇబి అధికారులు మాముళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇందుకూరుపేటలో నేరుగా ట్రాక్టర్ యజమాని ఎస్ఇబి అధికారుల అవినీతిని బయటపెట్టారు. నెల మాముళ్లు తీసుకున్నా అప్పుడప్పుడు దాడులు చేస్తున్నానంటూ పోలీసు స్టేషన్ ముందే ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. అధికారపార్టీ నేతల బెదిరింపులు, అధికారుల అవినీతితో ఇసుక, గ్రావెల్ యథేచ్ఛగా అక్రమంగా తరలిపోతోంది..

- ఎస్ఇబి అధికారుల మాముళ్లగోల
- అధికారపార్టీనేతల బెదిరింపులు
- సామాన్యులకు ఇసుక గగనమే

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ నూతన ఇసుక విధానం వల్ల ప్రజలకు ఉపయోగం జరగకపోగ తీవ్రమైన నష్టం జరుగుతోంది. టిడిపి ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా అందజేశారు. కేవలం ట్రాక్టర్, టిప్పర్ అద్దె మాత్రమే చెల్లించి భవన నిర్మాణ యజమానులు తీసుకునేవారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇసుక బంగారంలా మారిపోయిన విషయం తెలిసిందే. 2019 నుంచే ఇసుక విధానం వల్ల కొద్ది రోజులు నిర్మాణ రంగం నిలిచిపోయింది. జిల్లా వ్యాపితంగా సుమారు 2లక్షల మంది వరకు భవన నిర్మాణ రంగ కార్మికులున్నారు. నెలల పాటు నిర్మాణ రంగం కుదేలైపోయింది. విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చిన నిర్మాణ రంగంలోని కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడ్డారు. ఇదంతా గతం ఇసుకను అందిస్తామని, ఎక్కడా అవినీతి జరగకుండా, ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిపోకుండా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో హడావుడి చేసినా ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. అధికారపార్టీ నేతల బెదిరింపులతో హడలిపోతోన్న అధికారులు మనకెందుకులే అన్నట్లు వ్యవహ రిస్తున్నారు. ఇసుక, గ్రావెల్ మాఫియా జోలికి వెళ్లకుండా ఒకరో, ఇద్దరో ట్రాక్టర్ యజమానులను పట్టుకొని కేసుపెట్టి మమా అనిపించుకుంటున్నారు. ట్రాక్టర్ ఒక రీచ్ నుంచి ఇసుక తరలించాలంటే సుమారు రూ.2200 చలానా చెల్లించాలి. ట్రాక్టర్ నెల్లూరు నగరానికి రావాలంటే సుమారు రూ.4,500 నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నారు. ఒక టిప్పర్‌కు చలానా రూపంలో రూ.13,200 చెల్లించాల్సి ఉంది. నెల్లూరు నగరానికి చేరాలంటే సుమారు రూ.18వేలు వసూళ్లు చేస్తున్నారు. చలానా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేరాల్సి ఉంటుంది.

ఎస్ఇబి అధికారుల చేతివాటం..!

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఎస్ఇబి మాముళ్ల మత్తులో మునిగి తేలుతోంది. ప్రభుత్వానికి చలానా చెల్లించి ఇసుక తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు వ్యక్తులు ఒక్క చలానా చెల్లించి, రోజుల తరబడి అదే చలానాతో ఇసుక రవాణా చేస్తున్నారు. మరికొందరు రీచ్‌ల నుంచి కాకుండా మరో చోట నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇందుకూరుపేట మండలంలో సుమారు 60 ట్రాక్టర్లు చలానాలు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ ఉన్నా ఒక్క సారి చలానా చెల్లించి రోజులు తరబడి ఆ చాలనా చూపించి ఇసుక అక్రమంగా రవాణా చేసుకుంటున్నారు. ప్రతి నెలా ఒక్క ట్రాక్టర్ యజమాని ఎస్ఇబి స్థానిక అధికారులకు రూ.10 వేలు, టిప్పర్ యజమానులు నెలకి రూ.50 వేలు చెల్లించాల్సి వస్తుందని విమర్శలు వస్తున్నాయి. ఈ మొత్తం చెల్లిస్తే ఆ వాహనాలు అక్రమంగా రవాణా చేసుకోవచ్చు. లేదంటే కేసులు నమోదు చేస్తారని ఆరోపణలున్నాయి. ఇటీవల ఇందుకూరుపేట మండలంలోకి ఓ ట్రాక్టర్ యజమాని తన నెల మాములు రూ.10 వేలు చెల్లించారని, తీసుకున్న తనపై కేసు నమోదు చేశారని, నేరుగా పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. తాను ప్రతినెలా ఎస్ఇబి అధికారులు లంచాలు ఇస్తున్నారని, బహిరంగంగా విమర్శలు గుప్పించారు. జిల్లా వ్యాపితంగా ఇదే తంతు సాగుతున్నట్లు విమర్శలున్నాయి. అధికారపార్టీకి చెందిన వ్యక్తులు అక్రమ రవాణాకు పాల్పడుతుండడంతో అధికారులపైనా ఒత్తిడి వస్తుందని, అందుకే అధికారులు మౌనంగా అందిన వరకు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటే తప్ప ఎస్ఇబి అవినీతికి అడ్డుపడే పరిస్థితులు కనిపించడం లేదు.

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు

పంట పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకొని రాత్రి సమయంలో వాటిని పగలగొట్టి రాగి వైర్‌ను, అల్యూమినియం కేబుల్ వైర్‌ను, పొలాలకు నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మోటార్లను దొంగలించి తప్పించుకొని తిరుగుతున్న ఏగుడురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కావలి వెంగళరావు నగర్ ప్రాంతానికి చెందిన దార్ల కళ్యాణ్, దార్ల ఏడు కొండలు, కావలి ఇందిరమ్మ కాలనీకి చెందిన పరతాపు పెంచలయ్య, పరతాపు వెంకటేశ్వర్లు, పరతాపు తిరుపతి, దార్ల గోపి,దార్ల రమణ అను నిందితుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే 19 ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన రాగి వైర్, అల్యూమినియం కేబుల్, రెండు వ్యవసాయ మోటార్లను స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. బుధవారం నగరంలోని సిసిఎస్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిసిఎస్ డిఎస్‌పి ఎ.శివాజీ రాజు పాల్గొని వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి రాగి వైర్, అల్యూమినియం కేబుల్ వైర్, అగ్రికల్చర్ మోటారు దొంగతనాలు చోటు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి ముసునూరు రైల్వే ట్రాక్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అన్నదానం మిన్న

ప్రజాశక్తి-నెల్లూరు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో దాసరి అనంత పద్మనాభం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కీర్తిశేషులు దాసరి అనంత పద్మనాభం కుటుంబ సభ్యులు దాసరి హైమావతి, ప్రముఖ న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి దుర్గాప్రసాద్, దాసరి కిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ గురునాద రావు, వైస్ ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరి, ఫిజియోథెరపిస్ట్ లు వాసు, నవీన్, అక్తర్ ఇతర ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : కాకాణి

ప్రజాశక్తి -నెల్లూరు :జిల్లాలో పేదల గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కె టింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో గహ నిర్మాణం, భూ సమస్యలు, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు, భూ పంపిణీ, సర్వేపల్లి నియోజకవర్గం సమస్యలపై కలెక్టర్ ఎం హరి నారాయణన్, జా యింట్ కలెక్టర్ కూర్మనాథ్ సమక్షంలో మంత్రి సమీ క్ష నిర్వహించారు. మంత్రి మాట్లా డుతూ పేదల గహ నిర్మాణాల్లో అక్కడక్కడ అవకతవకలు జరుగుతున్నట్లు లబ్ధిదారులు తమ దష్టికి తీసుకు వస్తున్నారని, గహ నిర్మాణాల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని హౌసింగ్ అధికారులను హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎక్క డా కూడా హౌసింగ్ లో పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. హౌసింగ్ పీడీ నాగరాజు, ఆర్ డబ్ల్యు ఎస్, ఆర్అండ్ బి, పిఆర్ ఎస్ఈలు రంగవ రప్రసాద్, గంగాధర్, అశోక్ కుమార్, ఇండస్ట్రీస్ జిఎం సుధాకర్,ఆర్డీవో మలోల, ఎంపీడీవోలు, తహ శీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి

రొమ్ము కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేన్సర్ వైద్యశాలలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి సూచనల మేరకు కేన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. లక్ష్మి, కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ అధ్యక్షతన బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన నెలగా పరిగణించి రొమ్ము క్యాన్సర్ కోసం అంకితం చేసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో రొమ్ము కాన్సర్ ప్రపంచంలోనే మొట్ట మొదటి స్థానంలో ఉందని, ప్రతి నలుగురిలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నా రన్నారు. జీవనశైలి మారటం జంక్ ఫుడ్, ఆహారపు అలవాటులు, ఊబకాయము, వ్యాయామం లేకపోవటం ముఖ్యమైన కారణమన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల రొమ్ము క్యాన్సర్ ను కట్టడి చేయవచ్చని తెలిపారు. రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం. నాగేశ్వర రావు, (ఎంఎస్, ఎంసిహెచ్) సర్జికల్ ఆంకాలజిస్ట్ మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్ గీతా ఉషశ్రీ (ఎండి) రేడియషన్ ఆంకాలజిస్ట్, డాక్టర్ ఏ. లోకేశ్వరి (ఎండి), రేడియషన్ ఆంకాలజిస్ట్, డాక్టర్ ఎం. హేమంత్, మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ ఆర్.ఇ.ఎ.ముత్తు, సర్జికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ హరితా రాణి, రేడియాలజిస్ట్, క్యాన్సర్ యొక్క లక్షణాలు, క్యాన్సర్ నివారణకు తగిన సూచలను అందజేశారు. ఎం.డి.జుబేర్, కన్వినర్, కమలేశ్ జైన, కో-కన్వినర్ రెడ్ క్రాస్ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పట్టణంలోని 8వ వార్డు చైతన్య స్కూల్ వెనక పక్క, జాల రామయ్య రైస్ మిల్ ప్రాంతాల్లో బాబుతో నేను కార్యక్రమం జరిగింది. టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. చంద్రబాబు అక్రమ అరెస్టుపై ఇంటింటా ప్రచారం నిర్వహించిన పార్టీ నాయకులు. అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చంద్రబాబు జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని, ప్రజలంతా చంద్రబాబు మద్దతు పలకడాన్ని జగన్ జీర్ణించుకోలేక స్కిల్ డెవలప్మెంట్ అంశాన్ని తెరపైకి తెచ్చి అబద్దాల ప్రచారం చేస్తున్నారని నాగేశ్వరరావు చెప్పారు. పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, పిడికిటి రఘునాధరావు, వార్డు అధ్యక్షుడు దివి శ్రీనివాసులు, నాయకులు అత్తోట మాల్యాద్రి, వడ్డేళ్ళ వెంకటరావు, దివి రవి శేఖర్, చిమ్మిరి రామచంద్ర ప్రసాద్, కలవకూరి మాధవరావు, కాకుమాని ఆంజనేయులు, కాకుమని శీను, దివి శ్రీధర్, నల్లూరి సింగయ్య, బోట్ల రమణయ్య, కల్లూరి వెంకటేశ్వర్లు, గుళ్ళా నరసింహం, చిమ్మిరి సురేష్, ఓరుగంటి వెంకట్రావు, పిడికిటి పద్మ ఉన్నారు.

తోటపల్లిగూడూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి త్వరగా మెరుగుపడాలని, ఆయన వెంటనే విడుదలై ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరు తూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తోటపల్లిగూడూరు మండలంకోడూరు పంచాయతిలోని మహాలక్ష్మి అమ్మ వారి దేవాలయంలో పూజలు చేశారు. వీరబోయిన గంగాధర్, మొగిలి గుంట పోతన, బైనబోయిన శ్రీనివాసులు, చెరుకూరు పరంధామయ్య, ఊటు కూరు శ్రీనివాసులు, ఆవుల మునిరత్నం, తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆహా'ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్డులో లారీ బ్రిడ్జి కాటా ఎదురు నూతనంగా జరుగుమల్లి సతీష్ కుమార్ ఏర్పాటు చేసిన ఆహా ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం జరిగింది. బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలిండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు జ్యోతి ప్రజ్వలనం చేసి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కేశవరావు మాట్లా డుతూ తొలి రోజే ఆహా ఫ్యామిలీ రెస్టారెంట్‌ను యజమాని జరుగు మల్లి సతీష్ వినియోగదారులకు వినూత్న రీతిలో పాత రూపాయి నోటుకి కి ఒక బిర్యానీ,రూ. 2 నోటుకు రెండు బిర్యానీ ప్యాకెట్లను అందజేశారని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కందుకూరు దూబగుంట మధ్యలో ఫ్యామిలీ రెస్టారెంట్‌ని ఏర్పాటు చేయడం వల్ల సాయంత్రం వేళల్లో, సెలవుల్లో, ఆదివారాల్లో కుటుంబంతోటి సరదాగా కాసేపు బయటకు వచ్చే దానికి మంచి వాతావరణాన్ని సతీష్ కల్పించారన్నాడు. కార్యక్రమంలో సతీష్ పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కేశవ

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-కందుకూరు :రాష్ట్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఆరోగ్య నిపుణులు చేత పలురకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్థానిక సచివాలయం 10 బూడిద పాలెం పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈరోజు జరిగిన క్యాంపు లో జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ పాల్గొని మాట్లాడారు. పట్టణ పరిధిలోని క్యాంపు ను మున్సిపాలిటీ కమిషనర్ మనోహర్ , డాక్టర్ బ్యూలా గ్రేసి సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు వైద్య పరీక్షలు మందులు అందుబాటులో ఉంచారు. టి.పిఐ శ్రీనివాస రావు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వాలంటీర్ల కన్వీనర్లు గహ సారథులు పాల్గొన్నారు.

నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య, డిఎంఐ ఈ హుస్సేనమ్మలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఎన్‌బిటి కాలనీలో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. వైద్యాధికారులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అడిషనల్ మున్సిపల్ కమీషర్ సర్మద , ఎన్‌బిటి కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హారిక, మలేరియా విభాగం సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నంద కుమార్, కోర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -రాపూరు :రాపూరులోని మద్దెల మడుగు సమీపంలో తెలుగు గంగ నివాసగహంలో రాపూరు మండల మండల అధ్యక్షులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లకు మండల అధ్యక్షులు, ఇతర వైసిపి శ్రేణష్ట్రలకు ఎపికి జగన్ ఎందుకు కావాలో అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు. వారందరికీ ఆయన దిశేనిర్దేశం చేశారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.

రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలి : జనసేన

ప్రజాశక్తి నెల్లూరు అర్బన్ : రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలని జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మను క్రాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జనసేన జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. జనసేన నేత కేతం రెడ్డి వినోద్ రెడ్డి వైసిపిలో చేరిన నేపథ్యంలో ఆ పార్టీ ఎంపిగా అభ్యర్థిగా పోటీ చేయనున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఓటమి తప్పదన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించుకోవడమే అందరి లక్ష్యమన్నారు. జనసేన, టిడిపి కలయికకు ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు.జనసేన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నలిశెట్టి శ్రీధర్, కావలి నియోజకవర్గం ఇంచార్జ్ అలహరి సుధాకర్, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, సర్వేపల్లి సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్, కోవూరు సమన్వయకర్త శ్రీహరి రెడ్డి , రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ , జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా ఉన్నారు.

మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌రెడ్డి

వరి రైతులకు అవగాహన

తోటపల్లిగూడూరు :మండలం లో బుధవారం ఆత్మ సౌజన్యం తో, జిల్లా వనరుల కేంద్రం, అధికారులు, కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇచ్చారు. భరోసా కేంద్రాలు వరిగొండ -1, 2, మాచర్లవారిపాలెం, ఈదూరు రైతు భరోసా కేంద్రాల్లో లో రైతులకు శిక్షణ కార్యక్ర మాలను నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జిల్లా వనరుల కేంద్రం (నెల్లూరు) సి. మారుతీ దేవి రైతులకు వరిలో రకాలు, విత్తన శుద్ధి మొలక శాతం నిర్ధారించుట, నారు మడి యాజమాన్యం, చిరు ధాన్యాలు వాడకం, విలువ, ఆధారిత ఉత్పత్తుల పై రైతులకు అవగాహన కల్పించారు. కషి విజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. లోకేష్ బాబు జీవన ఎరువులను తప్పని సరిగా వాడుకోవాల ని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం (నెల్లూరు) వ్యవసాయ అధికారి ఈ. శైలజ కుమారి వరిలో ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు. జి. మధురిమ వ్యవసాయ అధికారి (జిల్లా వనరుల కేంద్రం) వరిలో నర్సరీ యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వి.వి శిరీషా రాణి మాట్లాడారు. వి.ఎ.ఎ లు సాగర్, సుమన్, ప్రసన్న, శ్వేత ఉన్నారు.

దర్గాలో మౌలిక వసతుల కల్పనకు కృషి

వెంకటాచలం :ప్రఖ్యాతిగాంచిన కసుమూరు దర్గాలో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.మండలంలోని కసుమూరులో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. రూ. 1.63 కోట్ల విలువైన సిసి రోడ్లు, డ్రెయిన్లు, కసుమూరు దర్గా తిప్ప పైన మస్తాన్ వలి భక్తుల వసతి సముదాయానికి ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి కాకాణి మీడి యాతో మాట్లాడారు. గతంలో కేవలం శంకుస్థాపనలు మాత్రమే చేసి పనులు పూర్తి చేయడం విస్మరించారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవ శిలాఫలకాలు ఆవిష్కరి స్తున్నట్లు పేర్కొన్నారు.ఒక్క కసు మూరులోనే ఇప్పటివరకు రూ 8.80 కోట్ల మేర అభివద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఎంపిడిఓ వెంకట రమేష్, ఎంపిపి మంద కవిత, సర్పంచ్ కడివేడి శివ, సచివాలయ కన్వీనర్ మనోజ్, స్థానిక నాయకులు జిల్లా వైఎస్ఆర్పిపి ఉపాధ్య క్షుడు మందల వెంకట శేషయ్య, ఉప ఎంపీపీ కోదండరామిరెడ్డి ఉన్నారు.

వైసిపి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై దాడులు జరగడమే కాకుండా, వారికి అన్యాయం జరుగుతోందని టిడిపి అధ్యక్షులు సన్నారె డ్డి సురేష్ రెడ్డి ఆరోపించారు. సౌత్ ఆములూరు ఎస్‌సి దళిత సామాజికవర్గానికి చెందిన నిరుపేద వికలాం గుడు ముద్దా రామయ్య, ఆ యన తల్లి వద్దురాలు వెంకమ్మలకు అందని రేషన్ సరుకు ల కోసం సచివాలయానికి వ చ్చిన అదే కులానికి చెందిన రుద్రపాక శ్రీనివాసులుని సచివాలయం సిబ్బంది, స్థానిక వైసిపి నాయకులు దుర్భాషలా డడమే కాకుండా గదిలో నిర్బంధించి పోలీసు స్టేషన్లో తప్పు డు కేసులు పెట్టారన్నారు. ఈ ఘటనను బుధవారం సౌత్ ఆములూరు గ్రామంలో ఏర్పా టు చేసిన మీడియా సమావే శంలో సురేష్ రెడ్డి తీవ్రంగా ఖం డించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను టిడిపి తీవ్రంగా ఖండిస్తుందని సురేష్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు దళితులు సి ద్ధంగా వున్నారన్నారు. ఎంపిటిసి కొణతం రఘుబాబు మాట్లాడారు. స్థానిక టిడిపి నేతలు ఉన్నారు.

జాతీయ రహదారి పనుల్లో

నాసిరకం మెటల్ వినియోగం

అధకారులను నిలదీసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

మండలంలో జరుగుతున్న 167బి నెంబర్ జాతీయ రహదారి నిర్మాణంలో నాసిరకం మెటల్ ను వినియోగిస్తున్నారని కందుకూరు నియోజ కవర్గ టిడిపి ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. వలేటివారిపాలెం మండలం చుండి పంచాయతీ పరిధిలో రామలింగబోడు కొండ నుంచి మెటల్ తవ్వేందుకు బ్లాస్టింగ్ చేస్తున్నారని, దానివల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు అయ్యవారిపల్లి ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయని గ్రామస్తులు ఇటీవల నాగేశ్వరరావు దష్టికి తీసుకొచ్చారు. దీంతో నాగేశ్వరరావు, పార్టీ నేతలతో కలిసి బుధవారం కొండ ప్రాంతాన్ని, అక్కడ నుంచి తరలిస్తున్న కంకరను పరిశీలించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ నాసిరకం కంకరను హైవే పనుల్లో ఉపయోగిస్తున్నారన్నారు. దానివల్ల రోడ్డు త్వరగా దెబ్బతినే అవకాశముందన్నారు. గత ఏడాది నవంబర్‌లో ఈ ఈ ప్రాంతంలోని సర్వేనెంబర్ 214 లో 4.8 హెక్టార్ల స్థలాన్ని 15 ఏళ్లపాటు కొంతమంది మైనింగ్ శాఖ నుంచి లీజు పొందారన్నారు. ఇక్కడ లభించే కంకరలో నాణ్యత లేదని, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణంలో ఉపయోగించకూడదని గతంలో ఆ శాఖ అధికారులు తేల్చి చెప్పారని నాగేశ్వరరావు తెలిపారు. మరోవైపు రెవెన్యూ అధికారులు సిఫార్సు చేశారన్న కారణంతో గ్రామ సభ నిర్వహించకుండా, పంచాయితీలో సాధారణ సమావేశం నిర్వహించి ఆ తీర్మానంతోనే లీజుకు అనుమతి ఇచ్చారని నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అక్కడి నుంచే పంచాయతీ కార్యదర్శి, అధికార పార్టీ సర్పంచ్ తో నాగేశ్వరరావు ఫోన్లో మాట్లాడారు. నియోజ కవర్గస్థాయి అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే లీజు ఇచ్చినట్టు అర్థమవుతుందన్నారు. అలా చేయడంలో ఆంతర్యం ఏమిటని సర్పంచ్ ను గట్టిగా ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు నాగేశ్వ రరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆవుల నరేష్, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, వలేటి నరసింహం వలేటి నరసింహం, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, కాకుమాని ఆంజనేయులు, కాకుమాని హర్ష, కామినేని వీరయ్య, కామినేని అశోక్ కూడలి భాస్కర్, కామినేని రఘు, మన్నం మాధవ, సుబ్బారెడ్డి, గొర్రెపాటి మాధవ, మోహన్, చుంచు శీను, బక్కమంతల మాల్యాద్రి, మానికొండ కొండయ్య, సుబ్బానాయుడు ఉన్నారు.

రోడ్డు పనులకి వినియోగిస్తున్న కంకరను పరిశీలిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వారితో పాటు వినియోగిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కందుకూరు డిఎస్‌పి రామచంద్ర చెప్పారు. బుధవారం కందుకూరు పట్టణంలోని క్లబ్ రోడ్డులో బుధవారం కుంచాల శీను కు చెందిన ప్లాట్ వద్ద ఐదుగురు గంజాయి విక్రయిం చేవారితోపాటు తాగే వారు ఉన్నారని సమాచారం రావడంతో కందుకూరు సిఐ నఫీజ్ బాషా, ఎస్ఐ హనీఫ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నారు. అనంతరం డిఎస్‌పి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. పట్టుబడ్డ వారికి వైజాగ్‌కు చెందిన రాము అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. అరెస్టు చేసిన ఐదుగురు వ్యక్తులు వద్ద ఒక కేజీ 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను రిమాండ్ కు పంపి స్తున్నట్లు డిఎస్పి రామచంద్ర తెలిపారు. సిఐ నఫీజ్ బాషా, ఎస్సై హనీఫ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి అని ఐటిడిఎ పిఒ డాక్టర్ మందారాణి పేర్కొన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ నెలిమెట్టి కండ్రిక, కోడూరు గ్రామాల్లో బుధవారం మొబైల్ ఆధార్ క్యాంపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ మంద రాణి, అజిత్ ప్రేమ్, హేమశ్రీ, గార్గిలు పాల్గొన్నారు. మందారాణి మాట్లాడుతూ ఆధార్ కార్డును కలిగి ఉండటం వలన హౌస్ హెూల్డ్ క్లస్టర్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డు పొందటం, రేషన్ కార్డులు ఫ్యామిలీ మెంబర్ యాడ్ చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయని యానాదులకు తెలిపారు. అర్హత కలిగిన 30 కుటుంబాలకు ఎంజిఎన్ఆర్ఈజిఎస్ జాబ్ కార్డులను పంపిణీ చేశారు. ప్రేమ్ తేజ, ఎస్పిఒ కిరణ్, పిఒ జాన్, సుధాకర్, ఎఫ్ఒ మస్తాన్, కోడూరు పంచాయతీ సెక్రటరీ అశోక్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

ప్రజాశక్తి -పొదలకూరు :పొదలకూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం సెబ్ ఆధ్వర్యంలో వాహనాలను వేలం వేశారు. సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ వివరాలు వెల్లడించారు. అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహన్నాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేశారు. రెండు వాహనాలకు కలిపి ప్రభుత్వం నిర్ణయించిన ధర 72,500కాగా, వేలంలో 122, 800 వచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పొదలకూరు సిఐ సంగమేశ్వర రావు, సెబ్ సిఐ వెంకట్రావు, సెబ్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ నిరసన

ప్రజాశక్తి -వెంకటాచలం డిగ్రీ ఫలితాల వెల్లడిలో జాప్యానికి కారణంకారణం విఎస్ యు అధికారులే నిర్లక్ష్యమే కారణమని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. విఎస్‌యు పరిపాలన భవనం ఎదుట బుధవారం టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆందోళన నిరసన చేపట్టారు. డిగ్రీ 2,4 సెమిస్టర్ ఫలితాల విడు దలలో విఎస్‌యు అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించారు. అనంతరం రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందజేశారు. టిఎన్ఎస్ఎఫ్ మండలం అధ్యక్షుడు ఎన్ వెంకటాద్రి, మనోజ్, నలబాలపు మహేష్, నారిపాక సాయి, బిరదవోలు శ్రీ హరి, కె దిలీప్, సుమన్, నాని, కష్ణ, నలబాలపు ప్రవీణ్, మణేంద్ర పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -రాపూరు :మండలంలోని రాపూరు సచివాలయ -1 పరిధిలోని వాటర్ ట్యాంక్, మల్లమ్మ గుంట, ఆంజనేయపురంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. మదెల మడుగు సెంటర్‌లోని తెలుగు గంగ గెస్ట్ హౌస్‌లో వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పాపకన్ను బ్రదర్స్ , భూపతి జయరామయ్య నేతత్వంలో 30 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి.వారందరినీ రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పెరిగిన కరెంటు ఛార్జీలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ గురువారం జరుగుతుందని నాయ కులు తెలిపారు. పెరిగిన కరెంటు ఛార్జీలను వ్యతిరేకించేవాళ్లుఆమోదిం చేవాళ్లు ఈ బ్యాలెట్ ద్వారా వారి అభిప్రాయాలను సిపిఎం కందుకూరు పట్టణ కమిటీ తరపున గౌస్ కోరారు..ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బ్యాలెట్ జరుగుతుందన్నారు.

కమిషనర్‌గా శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ బదిలీపై వెళ్లగా, రాజమహేంద్రవరం నుంచి గ్రేడ్-వన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొంది కావలి మున్సిపల్ కమిషనర్‌గా జి.శ్రావణ్ కుమార్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గత ఐదు నెలలుగా ఉన్న మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, డిప్యూటేషన్‌పై వచ్చి ఉన్నందున ఆయనను రిలీవ్ చేసి తన సొంత (ఆడిట్) శాఖకు పంపారు. కావలి పట్టణంలో ఈ కొద్ది నెలలకే మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ పలు వివాదాల్లో ఫ్లెక్సీల గొడవలో పాంప్లెట్లు అతికించే విషయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసి, అధికార పార్టీ నాయకుల మన్ననలు పొందారు. అధికార పార్టీ నాయకులకు ఆయన ఎంతో సాన్నిహిత్యంతో మెలిగి వారికి కావాల్సిన విధంగా పనులు చేసి పెట్టారు. ఇంత సాన్నిహిత్యంగా మెలిగినా ఆయన బదిలీ కావడం కొందరికి అనుమానాలకు తావిస్తోంది. కాకపోతే గ్రేడ్-1 అధికారిగా పదోన్నతి పొంది ఉన్న శ్రావణ్ కుమార్‌ను రెగ్యులర్ కమిషనర్‌గా, ఎన్నికల్లో ఉపయోగించుకునే ఆలోచనతోనే కావలికి బదిలీ చేశారని పట్టణ ప్రజలు ఆలోచన చేస్తున్నారు.

ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

బాధితుడికి ఎంపిటిసి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో బుధవారం డయాలసిస్ వ్యాధితో మృతి చెందిన టి.చంద్రప్ప కుటుంబానికి ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ రూ.10వేల తక్షణ ఆర్థికసాయం అందజేశారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి బిట్-1 ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుపేదలకు అన్ని విధాల సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాలకు చెందిన పేదలకు అన్ని విధాల ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఆయనవెంట జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, మట్ల లక్ష్మయ్య, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

రైల్లో జనరల్, మహిళా బోగీలను పెంచాలి : ఉమెన్స్‌ఫోర్స్

ప్రజాశక్తి-కావలి

రైల్లో జనరల్ మహిళా బోగీలను పెంచాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లైనా ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఏ ఒక్కరి ఆలోచనల్లోకి సామాన్యులు- మహిళా ప్రయాణీకుల గురించి కించిత్తు పట్టలేదన్నారు. ట్రైన్ ఏదైనా, ఒకే ఒక్క జనరల్ బోగీ, మహిళా బోగీ మాత్రమే కొనసాగుతుందన్నారు. రిజర్వేషన్ కంపార్టెమెంట్‌లో అధిక ధరలు చెల్లించలేక, జనరల్- మహిళా బోగీలలోనే టిక్కెట్ కొనుక్కుని, సుదూర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తున్నారని తెలిపారు. పేద బడుగు వర్గాలు, మహిళలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారన్నారు. ఏళ్ల తరబడీ కుటుంబాలతో తిరుమలకు ఇతర పుణ్యక్షేత్రాలకు, వలస కూలీలుగా పనుల కోసం, పెద్దపెద్ద నగరాలకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూనే తప్పనిసరిగా ప్రయాణాలు చేయాల్సి వస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని గమనించే నాయకులు లేకపోవడం విచారకరమన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెద్ద సంఖ్యలో దేశం నలుమూలలకు అత్యంత వేగవంతంగా, బహుళ సౌకర్యాలతో ప్రారంభించినా, పేదలకు, సామాన్య మహిళలకు ఏమి ప్రయోజనాలు ఒనగూడినట్లో కేంద్రప్రభుత్వమే చెప్పాలన్నారు. ఇన్నేళ్లుగా ఓటేసి ప్రభుత్వాలను గద్దెనెక్కిస్తున్న సామాన్య ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి "తగినట్లు రైళ్లన్నింటిలో తప్పనిసరిగా మూడు జనరల్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి సామాన్యులకు న్యాయం చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ, ప్రధానమంత్రి నిబద్ధతతో ఆలోచించి తక్షణమే అన్ని ట్రైన్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని బండగానిపల్లి రొడ్డుకు అనుకొని ఉన్న ప్రాంతంలో తెల్లరాయి అక్రమ తవ్వకాలపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రభుత్వ భూముల్లో అనేకమంది అనుమతులు లేకుండా లక్షలు వెచ్చించి తెల్లరాయిని తరలిస్తుంటే అధికారుల మౌనంపై పలు అనుమానాలు వ్యక్తం మవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అనుమతులు లేకుండా ఈ ప్రాంతంలో భారీ వాహనాలతో తెల్లరాయి పెకిలించి కూలీలతో రాత్రి, పగలు తేడా లేకుండా గ్రేడింగ్ చేస్తున్నారని వాపోయారు. విషయం తెలిసినా రెవెన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు మాత్రం చర్యలు లేకపోవడంపై పలు అనుమానాలకు దారితీస్తున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు తెల్లరాయి ముఠాల గుట్టు రట్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

వృద్ధురాలు సజీవ దహనం

ప్రజాశక్తి-కోవూరు

అనారోగ్యంతో ఓ పూరి పాకలో నివాసముంటున్న వృద్ధురాలు అగ్నికి ఆహుతి అయింది. ఈసంఘటన నెల్లూరు జిల్లా కోవూరు మండలం, కోనమ్మ తోటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కోవూరు పట్టణంలోని కోనమ్మ తోటలో నివాసముంటున్న సజ్జ రాజేశ్వరి (72) మతిస్థిమితం లేక పూరిపాకలో ఉంటుంది. బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పూరిపాక దగ్ధమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో వృద్ధురాలు మంటల్లో చిక్కుకొని కాలి బూడిదయ్యింది. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే డిఎబి చైర్మన్ నిరంజన్ బాబు రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ కుటుంబానికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందించారు. మృతురాలికి కుమారుడు ఉన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల పరిధిలోని సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కారించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2019 నుండి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజల సమస్యలను మరింత సంతృప్తికరమైన స్థాయిలో పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి రాలేని గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంతృప్తికర స్థాయిలోనే పరిష్కరించడం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి ముందుగానే షెడ్యూల్ ప్రకటించి ప్రతి బుధవారం, శుక్రవారం మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలు సమస్యలపై ప్రజల నుండి 275 ఆర్జీలు స్వీకరించామని, అర్జీల్లో 90 శాతం భూ సంబంధిత సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్థిష్టమైన గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ నియోజక వర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసు కోవడంతో పాటు అధికారులతో సమావేశమై నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రజల సమస్యలకు మరింత సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కూర్మనాధ్, ఆర్‌డిఒ కరుణ కుమారి, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్ పిడిలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, హేన సుజన్, సిపిఒ ఎస్ రాజు, డిటిసి చందర్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సమగ్ర శిక్ష ఎపిసి ఉషారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర రాజు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, సర్వే రికార్డుల ఎడి హనుమాన్ ప్రసాద్, పలువురు జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

పుస్తక పఠనంపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు తమ సమయాన్ని గ్రంథాలయంలో సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి నారాయణరావు సూచించారు. ఆయన బుధవారం గ్రామంలోని విద్యార్థులను గ్రంథాలయానికి ఆహ్వానించి పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. టీవీలు, సెల్‌ఫోన్లు చూడడం కన్నా మంచి పుస్తకాలు చదవడం కంటికి వంటికి మంచిదని ఆయన తన అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు. చిరిగిన చొక్కానైనా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అని పెద్దలు పుస్తకం ప్రాధాన్యతను తెలియజేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కదిరినాయుడుపల్లి పుస్తక పఠన కేంద్ర నిర్వాహకులు ప్రభావతి, తపాలా ఉద్యోగి రంతుల్లా పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నేతలు

కరేడులో 'బాబుతో నేను'

ప్రజాశక్తి-ఉలవపాడు

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను' కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని కరేడు పంచాయతీలోని ఉప్పరపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇంచార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని తెలిపారు. దొంగ చేతికి తాళాలు అప్పగిస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించే విషయం పక్కనపెట్టి, కేసులు, దాడులతో రాజకీయ కక్ష తీర్చుకుంటున్నాడని విమర్శించారు. ఒక్క ఆధారం కూడా లేని స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో, చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడ్డట్టు గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు అవినీతి జరిగిందా, లేదా అన్నది పక్కన పెట్టి, కుట్రతోనే బాబును జైలుకు పంపారన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు వెనక వాస్తవాలను ప్రజలంతా గ్రహించాలని సూచించారు. ధరలు, కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచేసి, పేదలను బాదుతున్నారన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తుండడంతో, జగన్మోహన్ రెడ్డి మళ్లీ మాయ మాటలు చెప్పడం ప్రారంభించారని, మరోసారి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమకుమారి మాట్లాడుతూ చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు ఎంత తేడా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. మీ బిడ్డను అంటూనే ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని, వైసిపి నేతల మాయ మాటలు నమ్మొద్దని సూచించారు. చంద్రబాబు నాయుడు త్వరలోనే నిర్దోషిగా విడుదలవుతారని, రాబోయే ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవి చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు. ఈసారి ప్రజలంతా టిడిపికి అండగా నిలబడాలని కోరారు. అంతకుముందు రామకృష్ణాపురంలోని రామాలయంలో, చంద్రబాబు త్వరగా విడుదల కావాలని కోరుకుంటూ పార్టీ నేతలు పూజలు నిర్వహించారు.

మాట్లాడుతున్న పోస్టల్ డిపార్ట్‌మెంటు ఎఎస్‌పి మధుసూదన్

పోస్టల్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లూరు

పోస్టల్ కార్యాలయాల్లో నూతనంగా ప్రవేశపెట్టిన పోస్టల్ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎఎస్‌పి మధుసూదన్ అన్నారు. బుధవారం గుడ్లూరు పోస్టల్ కార్యాలయంలో సబ్ పోస్ట్ మాస్టర్ ఎం.సతీష్ అధ్యక్షతన పోస్టల్ ఉద్యోగులతో అవగాహన సదస్సును నిర్వహించారు. రేఖ రంగు డిపాజిట్ తోటి పిఎల్‌ఐఆర్‌పిఎల్‌ఐ పథకాలను రూ.39లకే యాక్సిడెంట్ బీమా పాలసీ ప్రతి ఒక్కరూ తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బీమా పాలసీ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వినాయక రావు, అనిల్, వెంకటేశ్వర్లు, మండల పరిధిలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలానికి సంబంధించి ములుమూడి - వెల్లంటి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎంతో మంది అధికారులు, రాజకీయ నేతలు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారే రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఈ మధ్య కాలంలో నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రోడ్డును తవ్వించి, కంకర వేసి నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఈ రోడ్డు ద్వారా ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు, ఆటో, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-సంగం

మండల కేంద్రంలోని శ్రీ కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మూడో రోజు బుధవారం శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి అమ్మవార్లు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కీర్తి శేషులు కంటాబత్తిన సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం ధర్మపత్ని గిరిజమ్మ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాడు- నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని దాసరపల్లి అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జగనన్న మనబడి నాడు-నేడు పనులను బుధవారం ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూముల్లో టెక్స్‌టైల్‌లను ఒప్పందాలతో పూర్తి చేయాలని నాడు-నేడు కమిటీ రిజిస్టర్ మెయింటినెన్స్ చేస్తూ అందరి సంతకాలతో పనులను పూర్తి చేస్తూ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే జగనన్న మనబడి నాడు-నేడు పనులలో నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యతతో త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రతి కాంక్రీట్‌కు ఉదయం సాయంత్రం వాటర్‌తో క్యూరింగ్ చేయాలన్నారు. సిమెంటు స్టీల్ ఇసుక కంకర తగుపాలలో వేసి పిల్లర్స్ కాంక్రీట్ పనులను చేపట్టాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో విద్యార్థులు సంచరించకుండా డేంజర్ బోర్డ్సను ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు వాటిపై జాగ్రత్తలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు టి విజయకుమార్, రఫీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులు పరిశీలిస్తున్న అధికారులు

పలుచోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

పేదల చెంతకే వైద్య సేవలను తీసుకొచ్చి ధనవంతులతో సమానంగా పేదవాడికి మెరుగైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బోయిలచిరువెళ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గ్రామస్థాయిలోనె రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమగు మందులు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలియజేశారు. కార్యక్రమంలో 15మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో బోయిలచిరువెళ్ల సర్పంచ్ బొలిగిర్ల వెంకటేశ్వర్లు, పమిడిపాడు సర్పంచి సతీష్, ఎంపిడిఒ పి.ఐజాక్‌ప్రవీణ్, ఎఒ కె.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు చెరుకూరు శ్రీనివాసులు నాయుడు, డాక్టర్లు అనూష, దేవానంద్, స్పెషలిస్ట్ డాక్టర్లు ఇఒపిఆర్‌డి సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్.సర్దార్ అన్నారు. బుధవారం ఆత్మకూరు పురపాలక సంఘంలో పంచాయతీ ఆఫీస్ సచివాలయం-1, 2వ వార్డులకు సంబంధించిన మెడికల్ క్యాంపు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ కుమారి గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ బి.నాగేశ్వరావు, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిబ్బంది వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజున జరిగిన వైద్య శిబిరంలో దాదాపుగా 398 మందికి ఉచిత వైద్య సేవలు, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు ఎం.రాజశేఖర్, శివ కోటారెడ్డి, కొప్పోలు రమాదేవి, చెరుకూరు కామాక్షయ్య నాయుడు, వైసిపి నాయకులు జమీర్, అంద్రా సుబ్బారెడ్డి, డాక్టర్లు అస్మా దేవానంద్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మానుగుంట

విద్య, వైద్యానికి పెద్దపీట

ప్రజాశక్తి-ఉలవపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ఉలవపాడు పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి కందుకూరు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. గతంలో ఉలవపాడు మండల పరిధిలో కరేడులో మాత్రమే పిహెచ్‌సి ఉండేదని, అందులో కేవలం ఒక్కరు మాత్రమే డాక్టర్లు సేవలందించే వారని తెలిపారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత చాకిచెర్లలో కూడా కొత్త పిహెచ్‌సి ఏర్పాటు చేసి నలుగురు వైద్యులు నియమించి ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందేలా చూస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి, విద్యకు పెద్దపీట వేసిందని ఆరోగ్యశ్రీపై కొందరు అవగాహన లోపంతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మనం ఒక్కసారి మనకున్న సమస్య గురించి స్థానికంగా ఉన్న ఒక్క ఆశా వర్కర్లు తెలియజేస్తే మనకు దగ్గరలో మెరుగైన కార్పొరేట్ హాస్పిటల్ వారే గుర్తించి అన్ని వారే చూసుకొని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. విద్యపై తమకున్న అవగాహనతో నాణ్యమైన విద్యను అందించే క్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాడు-నేడు పనుల ద్వారా నిర్వహించి స్వచ్ఛమైన విద్యను అందించి ఐక్యరాజ్యసమితికి పోయేలా చేసిందన్నారు. బిడ్డల కోసం పాఠశాల రూపురేఖలను సంపూర్ణంగా మార్చిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చెంచమ్మ, పంచాయతీ కార్యదర్శి, కో ఆప్షన్, గ్రామ సర్పంచ్, వైసిపి నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది, సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

అనంతపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-కలిగిరి

మండలంలోని అనంతపురం గ్రామ పంచాయతీలోని జగనన్న ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని బుధవారం ఎంపిపి మెట్టుకూరు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, ఎంపిడిఒ కళాధర్ రావు మండల రెవెన్యూ అధికారి రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఆరోగ్య పరీక్షలు అనంతపురం సచివాలయంలో డాక్టర్ గీతారెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి 370 రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కార్యక్రమంలో పాల్గొని బాలింతలకు పౌష్టికాహారానికి సంబంధించిన చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ వారికి అవసరమైన సూచనలు సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో అనంతపురం వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్స్ పాల్గొన్నారు.

పిల్లలకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసి, ప్రస్తుతం వింజమూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్.బాబుల్- రమీజా దంపతుల కుమార్తె షేక్.సాదియా పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేసి చాక్లెట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో దాతలు షేక్.బాబుల్ - రమీజ దంపతులు వారి కుమార్తె చిన్నారి సాదియా, సఫియ, దాత కుటుంబ సభ్యులు షేక్.అలీఫ్, సంస్థ సభ్యులు ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న పేద పిల్లలకు చిన్నారి సాధియా పుట్టిన రోజు సందర్భంగా భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి సాధియాకు పుట్టినరోజు శుభా కాంక్షలు తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులైన షేక్.బాబుల్ - రమీజాకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దాత కానిస్టేబుల్ షేక్.బాబుల్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం ఆనవాయితీగా మార్చుకొని సేవలు కొనసాగిస్తున్నామని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా గత మూడు సంవత్సరాలుగా తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశామన్నారు.



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.NO. 2 / 2020
O.S. NO. 67 / 2009

మేకల అమరావతి ....డిక్రీహోల్డరు

Vs

1. ఇంటూరు ప్రభాకర్
2. ఇంటూరు రేవతి ....జడ్జిమెంటు డెబ్టార్స్

నోటీసు

టు,
R2 ఇంటూరు రేవతి,
D/o. ప్రభాకర్, ఊటుకూరు గ్రామం, సైదాపురం మండలం,ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

డిక్రీహోల్డరు దావా అమలుకు మీ మీద పిటీషను దాఖలు చేసియున్నందున, మీకు తేది. 28-11-2023న వాయిదా ఉన్నందున మీరు ఉదయం 10 గం॥లకు పై కోర్టు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు,
పి. భాస్కర్ రావు,
అడ్వకేటు, గూడూరు.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. NO. 107 / 2022

గుండపనేని@ నాగెళ్ళ కావ్య (అను) ....పిటిషనరు

Vs

గుండపనేని కోటేశ్వరరావు,
S/o. సంజీవయ్యనాయుడు, శానాయపాళెం రాపూరు మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా. ....రెస్పాండెంట్లు

టు,
గుండపనేని కోటేశ్వరరావు,
S/o. సంజీవయ్యనాయుడు, శానాయపాళెం రాపూరు మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

నోటీసు

పిటిషనరు విడాకులు కోరుచూ పిటిషను దాఖలు చేసియున్నందున, మీరు పై కోర్టులో ఉదయం 10 గం॥లకు తేది. 08-11-2023 న హాజరై మీకు గల ఆక్షేపణలు తెల్పుకోనియెడల మీ పరోక్షమున పిటీషను తీర్మానించబడును.

ఇట్లు,
పి. భాస్కర్ రావు,
అడ్వకేటు, గూడూరు.